క్లుప్తంగా

కరవది రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైలు ఆపాలి

ఒంగోలు రూరల్: కాకినాడ పోర్టు నుంచి తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైలు ప్రారంభం నుంచి కరవది రైల్వేస్టేషన్‌లో ఆగేది. ఒంగోలు మండలంలోని 18 గ్రామాల ప్రజలు కరవది రైల్వేస్టేషన్ నుంచి ఆ రైలులో రాకపోకలు సాగించేవారు. కోవిడ్ సమయంలో ఈ రైలును రద్దు చేశారు. ప్రస్తుతం తిరిగి ప్రారంభమవగా, కరవదిలో స్టాపింగ్ రద్దుచేశారు. దీంతో మండల ప్రయాణికులు రైలు ప్రయాణాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. 18 గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు కరవదిలో ప్యాసింజర్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నెమ్మానికి సత్కారం



నెమ్మానిని సత్కరిస్తున్న కత్తిమండి ప్రతాప్

ఒంగోలు టౌన్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తిరుపతి పట్టణంలో నిర్వహిస్తున్న సాహితీ బ్రహ్మోత్సవాల్లో ఒంగోలుకు చెందిన సాహితీవేత్త నెమ్మాని సీతారామమూర్తి సోమవారం తన కవితను వినిపించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ సాహిత్య వేడుకల్లో వివిధ రాష్ట్రాలలోని తెలుగు కవులు, కళాకారులు తమ రచనలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కవి నెమ్మాని సీతారామమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనాథ మహాకవి వంశస్తుడు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ, వారి కుటుంబీకులు పాల్గొని నెమ్మానిని అభినందించారు.

తహసీల్దార్‌ను కలిసిన వీఆర్‌ఏలు



తహసీల్దార్ రజనీకుమారితో వీఆర్‌ఏలు

మద్దిపాడు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.రజనీకుమారిని వీఆర్‌ఏల సంఘ మండల అధ్యక్షుడు ఎద్దు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదల రాజు, మండలంలోని పలువురు వీఆర్‌ఏలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కలిసి బొకేలిచ్చి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ రజనీకుమారి మాట్లాడుతూ వీఆర్‌ఏలు అందరూ నిర్వహిస్తున్న విధుల గురించి ఆరా తీశారు. వీఆర్‌ఏలు తమ డ్యూటీ చార్టులు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతిరోజూ సచివాలయానికి వచ్చి వీఆర్వో వద్ద హాజరుకావాలని సూచించారు.

చెత్త పన్ను రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆస్తి పన్ను వ్యతిరేక కమిటీ సభ్యులు

ఒంగోలు టౌన్: ఆస్తి పన్ను వసూళ్లతో కలిపి చెత్త పన్ను వసూలు చేయవద్దని, చెత్త పన్ను రద్దు చేయాలని ఆస్తి పన్ను వ్యతిరేక ఐక్య కార్యాచరణ కమిటీ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చెత్త పన్ను వసూలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే రద్దు చేయాలని కోరారు. అనంతరం మేయర్ గంగాడ సుజాతను కలిసి వినతి పత్రం అందజేశారు.

అధ్యాపకునికి డాక్టరేట్

ఒంగోలు: స్థానిక క్విస్ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకునికి డాక్టరేట్ దక్కింది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న కేవీజే భార్గవకు నేషనల్ మీడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) రూర్కెలా డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ పీఎస్ బాలాజీ, డాక్టర్ రంజిత్ కుమార్ సాహు ఆధ్వర్యంలో ఎలక్ట్రో కెమికల్ డిశ్చార్జి మెషినింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసినందుకు భార్గవ్ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, అధ్యాపకులు అభినందించారు.

774 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 774 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి రామకృష్ణ తెలిపారు. వేలం కేంద్రానికి 811 బేళ్లు రాగా, 3 నో బిడ్ అయ్యాయని, కేజీ గరిష్ఠ ధర రూ.200, కనిష్ఠ ధర రూ.173, సరాసరి ధర రూ.190.90గా నమోదైందని వివరించారు.



34వ డివిజన్‌లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు



5వ డివిజన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు



9వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు పూర్ణచంద్రరావు, వెన్నపూస వెంకటరెడ్డి

కోలాహలంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

- ఇంటింటికి తిరుగుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఉత్సాహంగా పాల్గొంటున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఒంగోలు/ఒంగోలు రూరల్/కొత్తపట్నం/నాగులుప్పలపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇంటింటికీ ఉన్న ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు వారికి ఘనంగా స్వాగతం పలికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. పథకాల గురించి ఆనందం వ్యక్తం చేస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను ఇంటి గోడలకు, ఫోన్లకు అంటించుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒంగోలు మండలంలోని మండువవారిపాలెం అంబేడ్కర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమాలలో గ్రామ సచివాలయ కన్వీనర్ కొమ్ము నాగేశ్వరరావు, కొమ్ము రోశమ్మ, గ్రామ సారధులు బోనాసి ఏసు, మూల్పూరీ ప్రభుదాసు, గ్రామ వలంటీర్లు తేళ్ల సునీల్, కొమ్ము సరోజిని, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు. కొత్తపట్నం మండలంలోని గుండమాల, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, ఈతముక్కల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గాలి స్వరూప, విశ్వనాథపల్లి ఆనందరావు, కారాని జయరావు, గాలి మునలారెడ్డి, కరీమ్, అజీమ్, కొక్కిలగడ్డ నాంచార్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నాగులుప్పలపాడు మండల కేంద్రంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పోతవరంలో సచివాలయ కన్వీనర్లు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై బుక్‌లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో దాకా అంజిరెడ్డి, కాకునూళ్ల పద్మ, శీలం సురేష్, పూనూరి గోపాల్‌రెడ్డి, కాకునూళ్ల సుబ్బారావు, జంపు శ్రీనివాసరావు, తిరుపతయ్య, నాగులుప్పలపాడు గ్రామ సర్పంచ్ మందా హెప్సీరాణి, రాపర్ల గ్రామంలో సర్పంచ్ దాకా అనసూయమ్మ రమణారెడ్డి పాల్గొన్నారు.



మండువవారిపాలెంలో...



45వ డివిజన్‌లో...



సెల్‌ఫోన్‌కు జగనన్న స్టిక్కర్ అంటిస్తున్న దృశ్యం



ఒంగోలు 18వ డివిజన్ వెంగముక్కలపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఇనమనమెళ్లూరులో పాల్గొన్న ఎంపీపీ వాకా అరుణ

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారిని కలుస్తున్నారని, వారంతా ఘనంగా స్వాగతం పలుకుతూ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, గుడ్డపాతల రవి, పైనం ప్రభాకర్, గ్రామ నాయకుడు గంగిరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



26వ డివిజన్‌లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల కృష్ణ



రంగాయపాలెంలో...



పోతవరంలో...



ఇనమనమెళ్లూరులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సైలు



మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్

మద్దిపాడు: మద్దిపాడు, సంతనూతలపాడు మండలాలకు నూతనంగా నియమితులైన ఎస్సైలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మద్దిపాడు మండల ఎస్సైగా బి.శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. సంతనూతలపాడు ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై మద్దిపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై తనకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. మండలంలో శాంతి భద్రతలకు అంతరాయం కలిగిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా సంతనూతలపాడు నూతన ఎస్సైగా నియమితులైన వీ ఆంజనేయులు కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చీమకుర్తి ఎస్సైగా ఈయన పనిచేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇద్దరు ఎస్సైలు మర్యాదపూర్వకంగా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును కలిసిన సంతనూతలపాడు ఎస్సై ఆంజనేయులు

ఎంపీపీ, ఎంపీడీవోలకు అంబేడ్కర్ చిత్రపటాల బహూకరణ

చీమకుర్తి (మద్దిపాడు): మండల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చీమకుర్తి ఎంపీడీవో కె.సీతారామారావుకు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా చిత్రపటాలు అందించినట్లు సంఘ నాయకులు తెలిపారు. వేమా శేషు, గోలా ప్రతాప్, చందా లాజర్, దేవరకొండ హనుమంతరావు, గండూరి నాగరాజు, తొట్టెంపూడి రాజా, నిప్పట్లపాడు ఎంపీటీసీ వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, గొల్ల సుబ్బారావు, శివ తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి ఎంపీపీ, ఎంపీడీవోలకు అంబేడ్కర్ చిత్రపటాలు అందిస్తున్న ఉద్యోగ నాయకులు

నిష్పక్షపాతంగా సమస్యలు పరిష్కరిస్తా

- బాధ్యతలు స్వీకరించిన కొత్తపట్నం ఎస్సై సాంబశివరావు

కొత్తపట్నం: కేసులపై నిఘా పెట్టి నిష్పక్షపాతంగా పరిష్కరిస్తానని కొత్తపట్నం నూతన ఎస్సై బి.సాంబశివరావు అన్నారు. ఒంగోలు వన్‌టౌన్ నుంచి కొత్తపట్నం బదిలీ అయిన ఆయన.. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ 2011లో హైదరాబాద్‌లో తనకు పోస్టింగ్ వచ్చిందని, 2017 నుంచి 2018 వరకు చిన్నగంజాం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేశానని చెప్పారు. 2019 నుంచి 2021 వరకు అర్థవీడులో, 2021 నుంచి ఇప్పటి వరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై రావడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి అందరికీ అందుబాటులో ఉంటూ కేసులను సత్వరమే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైటర్ అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై సాంబశివరావు

108 హోమగుండాలతో శ్రీ గాయత్రి మహాయజ్ఞం

ఒంగోలు రూరల్: కరవది అంబేడ్కర్‌నగర్‌లోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం వారిచే 108 హోమగుండాలతో శ్రీ గాయత్రి మహాయజ్ఞాన్ని కరవది రామలయ గాలిగోపురం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న 108 కోట్ల గాయత్రి మహామంత్ర అనుష్టాన జప పూర్ణాహుతి కార్యక్రమాన్ని గాయత్రి తీర్థ వ్యవస్థాపకులు, వేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య, మాతాభగవతిదేవి దివ్య సంరక్షణలో ఏప్రిల్ 14వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు కలశపూజ, నగరోత్సవం, దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఆహ్వానితులు గొలిమి వెంకటేశ్వర్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: మండలంలోని దేకనకొండ ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హామీ ఇచ్చారు. దేకనకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ యోగానంద లక్ష్మి నవనారసింహుల దివ్యధామాన్ని ఆమె దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి సోమవారం సందర్శించారు. గ్రామస్తులు వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు తాగునీటి సమస్య గురించి వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన వారు సంబంధిత అధికారులతో ఎస్టిమేషన్ వేయించుకుని తమను కలవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన ఆలయ ప్రతిష్ఠ జరిగి 41 రోజులైనందున శేషభట్టర్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన మండల అభిషేక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి మూల విరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం జరిగిన హోమంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ కోలా సంతోష్‌కుమార్, వీరగంధం కోటయ్య, సిద్ది వెంకటరెడ్డి, మునగాల కోటిరెడ్డి, రోశయ్య, పాతకోట వెంకటరెడ్డి, చిరంజీవి, నారాయణరెడ్డి, చంద్రమౌలి, ఆరె శ్రీను పాల్గొన్నారు.



హోమం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకాయమ్మ

కల్లబొల్లి మాటలు కాదు..చేతల ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

కురిచేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్లబొల్లి మాటలు చెప్పే ముఖ్యమంత్రి కాదని, అందరూ కలవరించేలా అభివృద్ధి పనులు చేస్తున్నారని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగదొనకొండలో ఆదివారం జరిగిన శ్రీ గంగాభవాని తిరునాళ్ల సందర్భంగా సర్పంచ్ ఆసుపల్లి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిర్మించిన విద్యుత్ ప్రభపై నుంచి ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనంతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. చంద్రబాబులాగా కల్లబొల్లి మాటలు చెప్పి కనిపించకుండాపోయే రకం కాదని, కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకిచ్చిన మాట ప్రకారం నవరత్నాలతో పాటు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన నేతన్నారు. ఒకసారి ఎమ్మెల్యే కాని వారు కూడా ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

అమ్మ బూచేపల్లి వెంకాయమ్మ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్నా నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధికి రూ.పది కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, నాయకులు కాకర్ల కృష్ణారెడ్డి, గోగులమూడి లింగారెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, చిరంజీవి, అంకె కృష్ణ, కోలా సంతోష్‌కుమార్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, వీరగంధం కోటయ్య, చిన్ని కార్తీక్, తెల్లమేకల వెంకటేశ్వర్లు ఉన్నారు.

హోమియో వైద్యం ఉత్తమం



అమ్మనబ్రోలు వైద్యశాలలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

నాగులుప్పలపాడు: ప్రజలను దుష్ప్రభావాలకు గురిచేస్తున్న అల్లోపతి వైద్యం నుంచి ప్రజలను కాపాడటానికి హోమియో వైద్యాన్ని కనిపెట్టిన డాక్టర్ హన్‌మన్ సేవలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగేశ్వరరావు, హోమియో వైద్యురాలు పెర్సిస్ అన్నారు. ప్రపంచ హోమియో వైద్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్యాస్ట్రోఎంట్రాలజీలో విద్యనభ్యసించిన హన్‌మన్ ఈ క్రూరమైన వైద్యం బారి నుంచి ప్రజలను కాపాడటానికి హోమియో వైద్యం కనిపెట్టి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి హన్‌మన్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.